క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గరుడోత్సవం



గరుడోత్సవంలో రంగనాథుడు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో శనివారం రంగనాథుడు సతీసమేతుడై గరుడోత్సవంపై ఊరేగారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి బిందె సేవ, అష్టోత్తరనామార్చన, మహామంగళహారతి అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షణలు చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై ఊరేగారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు



స్థలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

మద్దికెర : వ్యవసాయ పొలాలను ప్లాట్లుగా వేసి అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని ఆర్డీఓ మోహన్‌దాస్ హెచ్చరించారు. శనివారం మద్దికెర గ్రామ పరిసరాల్లో వేసిన వెంచర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు పండే భూములను ప్లాట్లుగా వేసి విక్రయిస్తున్నారన్నారు. సంబంధిత శాఖల అనుమతులు లేకుండా విక్రయించరాదని ప్రజలు కూడా కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక



శ్రీనివాస్



వికాస్

మద్దికెర: కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు స్థానిక ఆదర్శ పాఠశాలకు చెంది శ్రీనివాస్, వికాస్ అనే ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సవిత శనివారం తెలిపారు. తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12 వేలు అందిస్తారన్నారు. కావున ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఎంపికైన విద్యార్థులను అధ్యాపక బృందం అభినందించింది.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేత



జైనాబీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాదర్

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన వృద్ధురాలు జైనాబీ ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లోని కుమారుడి ఇంటికి వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ ఖాదర్ శనివారం హైదరాబాద్‌కు వెళ్లి ఆమెకు పింఛన్ అందజేశారు. తాను ఉన్న చోటికి వచ్చి పింఛన్ ఇవ్వడంపై వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేశారు.

కర్నూలు ఆసుపత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ



కర్నూలు ఆసుపత్రిలో జయమ్మకు పింఛన్ రూ.10 వేలు అందజేస్తున్న వలంటీర్ నాగేష్


నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. మండల పరిధిలోని కనకవీడు గ్రామానికి చెందిన డయాలసిస్ పేషెంట్ బోయ జయమ్మ వారం రోజులుగా కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ నాగేష్ శనివారం ఆసుపత్రికి వెళ్లి జయమ్మకు రూ.10 వేల పింఛన్ అందజేశాడు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి కుటుంబ సభ్యులు, పేంషెట్ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు సర్వసభ్య సమావేశం

ఆస్పరి: మండలం పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సుంకర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధా తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సమావేశంలో తాగు నీరు, వ్యవసాయం, విద్య, వైద్యం, విద్యుత్, శిశి సంక్షేమ శాఖలపై సమీక్షా నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరుతున్న వేళ!

- పత్తికొండ అభివృద్ధికి సీఎం వరాలు
- 'టమాట' ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు హామీ
- సాగు, తాగునీటి కష్టాలు తీర్చేందుకు పందికోన సమీపంలో ఎత్తిపోతల పథకం
- గోకులపాడు వద్ద బ్రిడ్జి నిర్మాణం
- బాలికల హాస్టల్‌కు పక్కాభవనం మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు



పత్తికొండ టమాట మార్కెట్(ఫైల్)

పత్తికొండటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండ నియోజకవర్గంపై వరాలు కురిపించారు. ఈ నెల 1వ తేదీన పట్టణంలో వైఎస్సార్ రైతు భరోసా ఐదో విడత ప్రారంభం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లకు పైగా నిధులు ప్రకటించారు. దశాబ్దాల కల అయిన టమాట జ్యూస్‌ఫ్యాక్టరీ నిర్మాణానికి హామీ ఇచ్చారు.

జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం పత్తికొండ నియోజకవర్గం. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతం ఫ్యాక్షన్ కోరల్లో చిక్కుకుని అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. అత్యల్ప వర్షపాతంతో మెట్టభూముల్లో సరైన పంటలు పండక, ప్రతి ఏటా వేలాదిమంది ప్రజలు గుంటూరు, హైదరాబాద్, రాజంపేట తదితర ప్రాంతాలకు వలసలు వెళుతుంటారు. ప్రజాప్రతినిధులు తమ స్వార్థ రాజకీయాలకు, వర్గ రాజకీయాలకు ఆజ్యం పోసి పబ్బం గడుపుకున్నారు. దీంతో విద్యాపరంగా, సామాజిక పరంగా, ఆర్థికంగా వెనుకబడిన ఈ ప్రాంతం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శ్రీకారం చుట్టిన జలయజ్ఞంతో అభివృద్ధిబాట పట్టింది. హంద్రీనీవా నీటితో సస్యశ్యామలమైంది. 2019లో వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యారు. అధికారంలోకి రాగానే ఆయన వెనుకబడిన నియోజకవర్గాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఈక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విజ్ఞప్తి మేరకు పత్తికొండపై సీఎం వరాల జల్లు కురిపించారు.

అందులో ప్రధానమైనవి..

హంద్రీనీవా లిఫ్ట్ ఏర్పాటుకు రూ.80కోట్లు

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ప్రధాన కాలువ 106వ కిలోమీటరు వద్ద పందికోన రిజర్వాయర్ సమీపంలో రూ. 80 కోట్లతో లిఫ్ట్(ఎత్తిపోతల పథకం) ఏర్పాటుకు సీఎం హామీ ఇచ్చారు. ఈ పథకం ద్వారా పత్తికొండ, తుగ్గలి మండలంలో 6 వేల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందనుంది.

బీసీ బాలికల హాస్టల్‌కు శాశ్వత భవనం

నియోజకవర్గంలో బీసీ జనాభా అధికంగా ఉంది. నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండలో బీసీ బాలికలకు ఇంతవరకు హాస్టల్ లేదు. దీంతో ఈ ప్రాంత బీసీ విద్యార్థినులు చదువుల కోసం డోన్, కోడుమూరు, కర్నూలు, ఆదోని తదితర ప్రాంతాల్లోని హాస్టళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి. రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో పత్తికొండకు బీసీ బాలికల హాస్టల్ మంజూరైంది. తాత్కాలిక అద్దె భవనాల్లో హాస్టల్ నిర్వహిస్తున్నారు. శాశ్వత భవనం నిర్మాణానికి సీఎం రూ. 1.75 కోట్లు మంజూరు చేశారు. దీని వల్ల 300 మంది బీసీ బాలికలకు ప్రయోజనం కలుగుతుంది.

దశాబ్దాల కల టమాట జ్యూస్ ఫ్యాక్టరీ

గత 30ఏళ్లుగా ఈ ప్రాంత రైతాంగం టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం దురుచూస్తున్నారు. అన్ని పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడం, గెలిచిన తర్వాత తుంగలో తొక్కడం పరిపాటిగా మారింది. ఈనెల1న పత్తికొండకు వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు హామీ ఇవ్వడమే కాక టమాట ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు రూ.10 కోట్లు కేటాయిస్తున్నట్లు నిండు సభలో ప్రకటించారు. అంతేకాదు రెండు నెలల్లో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టరుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి లభిస్తుంది.

గోకులపాడు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 7.5కోట్లు

క్రిష్ణగిరి మండలం టి.గోకులపాడు గ్రామం వద్ద హంద్రీనదిపై బ్రిడ్జి నిర్మాణం జరిగితే ఆ గ్రామ ప్రజలతో పాటు, రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గోకులపాడు వాసులు మండల కేంద్రమైన క్రిష్ణగిరికి రావాలంటే ప్రస్తుతం వెల్దుర్తి మీదుగా 20 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి పూర్తయితే దూరభారం తగ్గడంతో పాటు హంద్రీనదికి అవతలివైపున భూములు ఉన్న రైతులకు మేలు జరుగుతుంది. ముఖ్యంగా టి.గోకులపాడు, ఎస్.హెచ్ ఎర్రగుడి, రామక్రిష్ణాపురం గ్రామాల ప్రజలకు కొత్త బ్రిడ్జి ఎంతగానో ఉపయోగపడుతుంది.



బ్రిడ్జి నిర్మాణం జరుగనున్న టి.గోకులపాడు గ్రామం వద్ద హంద్రీనది

- ఈ ప్రాంతంలోని గ్రామాల్లో ఉల్లిపాడి తయారీకి అవసరమైన యూనిట్లు స్థాపించాలని కలెక్టరుకు ఆదేశాలు ఇచ్చారు. ఇవి అమలైతే ఉల్లి రైతులకు మేలు జరగడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి లభిస్తుంది.
- కంబాలపాడు-కోయిలకొండ రహదారిలో, మారెళ్ల-బొందిమడుగుల రోడ్డులో బ్రిడ్జిల మరమ్మతులకు నిధులు విడుదల చేయడం ద్వారా ఆయా గ్రామాల ప్రజల రవాణా సౌకర్యం మెరుగవుతుంది.
- తుగ్గలి మండలం జొన్నగిరి, వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామాల్లో ప్రభుత్వభూములు లేనందున పేదలకు ఇళ్ల పట్టాలు అందలేదు. వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అదనపు నిధులు కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లోని అర్హులైన వందలాదిమంది పేదలకు మేలు జరగనుంది.

రైతులకు ఎంతో మేలు



గతంలో జరిగిన ఫ్యాక్షన్ హత్యలు, నిరక్షరాస్యత, నీటి పారుదల సౌకర్యం లేక మా గ్రామం ఎంతో వెనుకబడి ఉంది. హంద్రీనీవా కాలువకు లిఫ్ట్ ఏర్పాటుచేసి మా గ్రామాల పరిధిలోని భూములకు సాగునీరు అందితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఏడాదికి రెండు పంటలు పండటం వల్ల మేమంతా బాగుపడటమే కాకుండా, వ్యవసాయ కూలీలకు ఏడాదిపాటు సొంత ఊళ్లోనే పని దొరుకుతుంది. వలసలు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

– పూరి శ్రీరాములు, చక్రాళ్ల

టమాట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు అభినందనీయం



టమాట జ్యూస్‌ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం గత 30 ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేశాం. అందరూ హామీలు ఇవ్వడం, తర్వాత మరచిపోవడం జరుగుతుంది. ఇప్పుడు సీఎం హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రూ'.10కోట్లు ప్రకటించడం ఎంతో అభినందనీయం. జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేస్తే రైతాంగానికి ఎంతో ఉపయోగం జరుగుతుంది.

– పి.రామచంద్రయ్య, ఏపీ రైతు సంఘం(సీపీఐ) రాష్ట్ర అధ్యక్షుడు

సీఎం జగనన్న మేలు మరవలేం



పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు ఎన్నటికీ మరువబోం. రూ.100కోట్లకు పైగా అభివృద్ధి పనులు అడగగా, ఒక్కటి కూడా కాదనకుండా అన్నీ మంజూరు చేశారు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. – కంగాటి శ్రీదేవి, ఎమ్మెల్యే

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



పట్టణంలోని 34వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లోని నవరత్నాల కంటే ఎక్కువగా సంక్షేమ పథకాలు మంజూరు చేసి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రమేష్‌లతో కలిసి పట్టణంలోని 34వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన కుటుంబాలను కలిసి బుక్‌లెట్లు ఇచ్చి ఆయా పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వార్డు సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా అందజేస్తున్నారన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రణాళికలు

పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకై తగిన ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఇందుకోసం జీడీపీ నుంచి పట్టణానికి ఏఐబీ స్కీం కింద రూ.142కోట్లతో మంచినీటి పైప్‌లైన్లు, ట్యాంక్‌ల నిర్మాణాలు ఏర్పాటు చేయనున్నారన్నారు. కార్యక్రమంలో డీఈ మనోహర్‌రెడ్డి, కో ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్‌కుమార్, గట్టుఖాజ, కోటకొండ నరసింహులు, యుయు నాగేష్, సయ్యద్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి



గద్వాల గేరిలో ఎద్దులతో పారువేట



మిలిటరీ దుస్తుల్లో గుడేకల్ యువకులు ప్రదర్శన

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు గాజులదిన్నె, కులుమాల, చిన్న నేలటూర్ తదితర గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం వైభవంగా జరుపుకున్నారు. రైతన్నలకు వ్యవసాయ పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటూ, ధాన్యలక్ష్మిని ఇంటిని తోడ్కొని వచ్చే బసవన్నలను శుభ్రంగా కడిగి ఎద్దుల కొమ్ములకు వివిధ రంగులు పూసి వాటి మెడలో కొత్త గంటలు, రంగుల పూసలు, పూలతో నిండిన దిష్టితాళ్లతో అలంకరించారు. మండల కేంద్రంలో గద్వాల గేరి, మొట్టివీధి, అచ్చుకట్ల గేరి, లక్ష్మీపేట, చాకలి వీధి, కురువ పేట ప్రాంతాల్లో ఎద్దుల పారువేట కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో ప్రధాన విధుల్లో ఏర్పాటు చేసిన చావిడి తోరణాలకు తీసుకొని వెళ్లి పారువేట కార్యక్రమాన్ని నిర్వహించారు.

మద్దికెర : మండలంలో మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాల్లో శనివారం ఏరువాక పున్నమి సందర్భంగా రైతులు తమ ఎద్దులను అందంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుందని, చినుకులు పడితే విత్తనం సాగు చేస్తామని రైతులు తెలిపారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో శనివారం సాయంత్రం ఏరువాక సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి ఒక్కొక్క గ్రామంలో ఒక విధంగా చేస్తారు. ఇందులో భాగంగా గ్రామంలోని వృషభాలకు శుభ్రంగా స్నానాలు చేయించి కొమ్ములకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. సాయంత్రం పారువేట వందలాది హర్షధ్వానాల మధ్య జరిగింది. పారువేటలో వృషభం తెంచిన ఆకులను తీసుకునేందుకు ప్రజలు ఎగబడ్డారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ పోలీసులు సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో జరిగిన వేడుకల్లో వీరశైవ లింగాయితి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, పెద్దలు హాజరయ్యారు.

అదిరేటి డ్రస్ మీరేస్తే...

ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామంలోని యువకులు తమకు నచ్చిన హీరోల గెటప్స్‌తో ఊరేగింపుగా వస్తు ప్రజలను అకట్టుకున్నారు. అల్లు అర్జున్ పుష్ప-2, రామ్‌చరణ్ వేషధారణలో పంచకట్టుకొని సైకిల్ తొక్కుతు, కల్యాణ్, ఖైదీలు, మిలటరీ పోలీసులు, జాతీయ జెండాతో ప్రదర్శన పాటు ఒకే రకం దస్తులు ధరించి అకట్టుకున్నారు.

ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

పత్తికొండ రూరల్: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బంగి శ్రీధర్, సురేష్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రభుత్వ మెడికల్ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఇరిగేషన్ ఉద్యోగులు ఒక్కరోజు నిరాహార దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజశేఖర్, తాలూకా నాయకులు పాల్గొన్నారు.

త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలి

తుగ్గలి : త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని హౌసింగ్ డీఈ గురుప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వీరరాజు హౌసింగ్ ఏఈ విజయకుమార్‌తో కలిసి తుగ్గలి జగనన్న లే అవుట్‌ను సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే పని కూడా పూర్తయిందని రెండు రోజులకంతా కాలనీలో నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్లు కట్టు కోవాలని లేని పక్షంలో పట్టాలు రద్దు అవుతాయని చెప్పారు.

మద్దికెర : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ అన్నారు. శనివారం మద్దికెర, పెరవలి గ్రామాల్లో జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మద్దికెరలో 156 గాను 33, ఎం.అగ్రహారంలో 49 గాను 23, పెరవలిలో 172 గాను 41, ఎడవలిలో 37 గాను 21 పూర్తి చేశారన్నారు. మిగిలిన లబ్ధిదారులు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు దశలవారీగా బిల్లులు మంజూరు చేయడమే గాకుండా కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- 16వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో డ్వామా పీడీ
- మల్కాపురం ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ సస్పెండ్
- రూ. 41,456 రికవరీకి అదేశం



సామాజిక తనిఖీ సభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఎమ్మిగనూరురూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనం అవరణలో ఉపాధిహామీ పథకంలో 16వ సామాజిక తనిఖీపై బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి పనులను పారదర్శకంగా జరపాలన్నారు. మండలంలో 16 పంచాయతీల్లో ఉపాధిహామీ కింద రూ. 9,93,78,792లు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయల భవన నిర్మాణాలకు రూ. 4,73,88,338 చెల్లించినట్లు చెప్పారు. రెండు రకాల పనుల కింద మొత్తం రూ.14,67,67,130 చెల్లించినట్లు తెలిపారు. అయితే, మల్కాపురం గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించటం, కొలతలు సరిగా లేకపోవటంతో సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. టెక్నికల్ అసిస్టెంట్ అనారోగ్యం కారణంగా సెలవులో ఉన్నారని, తరువాత విచారిస్తామన్నారు. మొత్తం రూ.41,456 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు.

పండ్లతోటలు పెంపకంపై దృష్టి సారించాలి

రైతులు ఉపాధి హామీ కింద పండ్ల తోటలు పెంపకంపై దృష్టి సారించాలని డ్వామా పీడీ సూచించారు. ఓర్వకల్లు, ఆలూరు, బనవాసి నర్సరీల్లో పండ్ల మొక్కలతో పాటు కూరగాయాలు, కానుగ, మునగ మొక్కలను పెంచుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వలసల నివారణకు స్థానికంగానే పనులు కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో అడిషనల్ పీడీ సలీంబాషా, జిల్లా విజిలెన్స్ అధికారి సిద్ధలింగమూర్తి, ఏపీడీ అల్లీపీరా, ఎంపీపీ గొల్ల కేశన్న, ఎంపీడీఓ బంగారమ్మ, ఏపీఓ విజయమోహన్, వివిధశాఖల అధికారులు, ఉపాధి సిబ్బంది, ఎఫ్ఏలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

టీఏను పరామర్శించిన పీడీ

ఎమ్మిగనూరురూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న టెక్నికల్ అసిస్టెంట్ తిరుమలనాయుడును ఆయన ఇంటికి వెళ్లి డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్యంగా కోలుకున్నాక విధుల్లో చేరాలని చెప్పారు. పరామర్శించిన వారిలో పీడీతో పాటు అడిషనల్ పీడీ సలీంబాషా, జిల్లా విజిలెన్స్ అధికారి సిద్దలింగమూర్తి తదితరులు ఉన్నారు.

దళిత భూముల అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

హొళగుంద: లింగంపల్లి గ్రామంలో 20 ఏళ్ల క్రితం దళితులకు పంపిణీ చేసిన ల్యాండ్ సీలింగ్ భూముల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేసి అర్హులైన దళితులకు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం దీనిపై దళిత సంఘాల నాయకులు రాజు, మనోజ్, గుడుదప్ప, బాధిత రైతులు హొళగుందలో తహసీల్దారు హుసేన్ సాహెబ్‌ను కలిశారు. దళిత నాయకులు మాట్లాడుతూ 1997లో భూమి లేని నిరుపేద కుటుంబాలకు వ్యవసాయం చేసుకుని జీవించడానికి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా అప్పటి ప్రభుత్వం 20 మంది లబ్ధిదారులకు భూ పంపిణీ చేసిందన్నారు. ఆ భూమిని లబ్ధిదారులు సాగు చేసుకుంటూ జీవనం చేస్తున్న సమయంలో 2021లో అప్పటి రెవెన్యూ అధికారులు ఒరిజినల్ రికార్డులను తారుమారు చేసి 20 మందికి ఇచ్చిన భూముల విస్తీర్ణాన్ని కుదించి జాబితాలో మరో ఆరుగురుని చేర్చి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆ ఆరుగురు పేర్లను ఆన్‌లైన్ అడంగల్‌లో కూడా ఎక్కించారన్నారు. దీని పై తగిన చర్యలు తీసుకుని అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. విచారణ చేస్తున్నామని వాస్తవాలు తులిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వారికి హామీ ఇచ్చారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కృష్ణగిరి: రహదారులపై ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నిడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని అమకతాడు గ్రామ సమీపంలో శనివారం ఆయన ఆటో డ్రైవర్లకు రహదారి నిబంధనల గురించి తెలియజేశారు. పరిమితికి మించి ప్రమాణికులను తరలించమే కాకుండా అజాగ్రత్తగా, అతివేగం కారణంగానే ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతుందన్నారు. రహదారుల్లో సూచించిన మార్కింగ్‌లోనే వెళ్లాలని, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపరాదన్నారు. ప్రయాణికులను పరిమితికి మించి తీసుకెళ్లినా, డ్రైవర్లు లైసెన్స్‌లు, వాహనాలకు ఆర్సీలు లేకున్నా సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

వెల్దుర్తి ఇన్‌చార్జ్ ఈఓగా నాగేశ్వరరావు

వెల్దుర్తి: స్థానిక మేజర్ పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓగా నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కల్లూరు మండలం ఉలిందకొండ పీఎస్‌గా ఉన్న నాగేశ్వరరావును వెల్దుర్తి ఇన్‌చార్జ్ ఈఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణపై ప్రధాన దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ



సమ్మర్ క్యాంపు పూర్తి చేసుకున్న క్రీడాకారుల బృందం

పత్తికొండ రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణలో సమ్మర్ క్యాంపు పూర్తి చేసిన అండర్-16 వాలీబాల్ క్రీడాకారులకు బుల్స్‌అండ్ ఈగల్స్ ఆర్గనైజేషన్, బీఎల్ డెకరేషన్ బృందం ఎస్ఐ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. శనివారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు పాటు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఈటీలు హుసేన్‌షా, మక్తుంవలి, లక్ష్మన్న, ధనుంజయ,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



విద్యార్థులకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి

ఆలూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ చెత్తా చెదారం, ప్లాస్టిక్ ను నిర్మూలించేందుకు కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి అన్నారు. ప్లాస్టిక్ వాడకం ద్వారా వచ్చే సమస్యలపై శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల అవరణ నుంచి గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి చిరంజీవి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు, గ్రామాల్లో ప్రజలకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చైతన్యపరచాలని సూచించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



కప్పట్రాళ్ల గ్రామస్తులతో సమావేశమైన పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ఆలూరు/దేవనకొండ: పత్తికొండ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ఫ్యాక్షన్ ముఠాకక్షలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోక తప్పదని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం గ్రామంలో ఉన్న పోలీస్ అవుట్ పోస్టును తనిఖీ చేశారు. అనంతరం గ్రా మస్తులతో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా జీవితాలను మార్చుకోవాలన్నారు. మూర్ఖంగా ముఠాకక్షలకు పా ల్పడడం కుటుంబాలు, బంధువులు, మిత్రులు, భార్య బిడ్డలకు దూరంగా జైళ్లకు వెళ్లిపోవడం మాను కోవాలన్నారు. ఆయన వెంట పత్తికొండ రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, దేవనకొండ ఎస్ఐ భూ పాలుడు, పోలీసులు తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు పైచింతలకొండకు రోడ్డు



పీసీకొండ బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

తుగ్గలి : ఎన్నో ప్రభుత్వాలు మారినా ఆ ఊరి రోడ్డుకు మోక్షం లభించలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండల పరిధిలోని పైచింతలకొండ గ్రామానికి ఏపీ రూరల్ రోడ్డు కనెక్టివిటీ కింద 3.9 కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు రూ.3.71కోట్లు నిధులు మంజూరయ్యాయి. రెండేళ్ల కిందటే ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పనులకు భూమి పూజ చేశారు. మెగా కంపెనీ మట్టి పనులు కూడా చేపట్టింది. అయితే, కరోనా కారణంగా పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే చొరవతో శనివారం మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. సచివాలయ కనీ్వనర్ మాజీ సర్పంచ్ హనుమంతు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు ప్రారంభం కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు సర్పంచ్ పుష్పావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమంతు, రవి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.